క్లుప్తంగా

ఖరీఫ్ పంటలపై కార్యాచరణ



సహాయకులతో సమావేశంలో పాల్గొన్న ఏఓ

మద్దికెర : వర్షాలు సకాలంలో కురుస్తున్నందున రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై కార్యాచరణ రూపొందించాలని మండల వ్యవసాయాధికారి రవి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటకాలంలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు. వాతావరణానికి అనుకూల పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఏఈఓ భోజరాజు, సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

మాన్యం కౌలుకు వేలం

మద్దికెర : స్థానిక చెన్నకేశవ దేవాలయానికి చెందిన 43 ఎకరాలను ఏడాది పాటు కౌలుకు ఇవ్వడానికి గురువారం వేలం నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మాన్యం కౌలు బహిరంగ వేలం వేయగా రూ.2,07,000 ఆదాయం వచ్చిందని చెప్పారు.

రోడ్డును బాగుచేయాలి



ములుగుందంలో రోడ్డుపై గుంతలను చూపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో గుంతలు పడ్డ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మన్న, రమేష్, దస్తగిరి, వీరేష్, భీమన్న అధికారులను కోరారు. వారు గురువారం అధ్వానంగా ఉన్న ములుగుందం గ్రామం నుంచి ఆదోనికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. ములుగుందం నుంచి ఆరెకల్లు వరకు 6 కిలోమీటర్ల రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారిందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

1,888 మంది రైతుల ఖాతాల తిరస్కరణ

దేవనకొండ: మండలంలో 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నష్టపరిహారం పొందేందుకు అర్హులైన 1888 మంది రైతుల ఖాతాలు తిరస్కరణకు గురైనట్లు ఏఓ సురేష్ బాబు తెలిపారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 23 వేల మందికి పంట నష్టం వాటిల్లగా, 1888 మంది రైతులకు మినహా మిగతా వారి ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో లేకపోవడంతో నగదు జమకాలేదని, లావాదేవీలు కలిగిన బ్యాంకు ఖాతాలను రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి అందజేయాలని సూచించారు. త్వరలోనే మిగతా రైతులకు పంట నష్ట పరిహారం జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సహకార సొసైటీ చైర్‌పర్సన్ రాజీనామా



హనుమంతమ్మ

ఆలూరు: ఆలూరు సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ హనుమంతమ్మ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సీఈఓ వెంకటరెడ్డికి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా హనుమంతమ్మతో పాటు త్రిసభ్య కమిటీ సభ్యులు గతేడాది ఏప్రిల్ 17న పదవీ బాధ్యతలు చేపట్టారని, ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో పాటు కమిటీ సభ్యులు రాజీనామ పత్రాలను అందించినట్లు వెల్లడించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధంగా ఉంచిన పోలీసులు

కృష్ణగిరి: మండలంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో హంద్రీ నీవా కాలువ పక్కన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ 14 కేసులకు సంబంధించి 7,969 టెట్రా ప్యాకెట్లు, 60 లీటర్ల నాటుసారా నేలపాలు చేశామని చెప్పారు. వీటి విలువ రూ.4,50,000 గా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మామిడాకుల తోరణాలతో స్వాగతం పలుకుతున్న జొన్నగిరి ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమేష్



కిట్లను అందజేస్తున్న ఎంఈఓలు

పాఠశాలలు పునఃప్రారంభం

తుగ్గలి : నూతన విద్యా సంవత్సరం ఆరంభమైంది. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. 45 రోజుల పాటు ఇంటి వద్ద ఆటపాటలతో సరదాగా గడిపిన పిల్లలు మళ్లీ బడిబాట పట్టారు. తొలిరోజు హాజరు అంతంత మాత్రంగా నమోదైంది. హాజరైన విద్యార్థులకు ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు స్టూడెంట్ కిట్ అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో పండుగ వాతావరణం కనిపించింది. హాస్టల్ గుమ్మానికి మామిడాకులతో తోరణాలు, టెంకాయ మట్టలు కట్టి వార్డెన్ రమేష్ విద్యార్థులను స్వాగతించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని ఎంఈఓ కోరారు.



తుగ్గలిలో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగు అందజేస్తున్న ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా కిట్లను అందజేస్తున్నామని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ కోరారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందజేసే స్టూడెంట్ల కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, మూడుజతల దుస్తులు, బూట్లు, బెల్టు, బ్యాగ్ అందజేసిందన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి అందజేయాలని సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

హాలహర్వి: మండలకేంద్రంతో పాటు నిట్రవట్టి, అర్ధగేరి, బాపురం తదితర అన్ని గ్రామాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలను హెచ్‌ఎంలు తెరిచారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, చిక్కీలను అందించారు. మిగిలిన పాఠశాలల్లో శుక్ర, శనివారాల్లో బ్యాగులు, పుస్తకాలు, చిక్కీలు, షూష్ అందజేయనున్నట్లు ఎంఈఓ ఈరన్న తెలిపారు.

హొళగుంద: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. మొదటి రోజు కావడంతో తక్కువ సంఖ్యలో విద్యార్థులు హాజరైనా పిల్లలు ఉత్సాహంగా పాఠశాలలకు తరలివచ్చారు. 65 శాతం మంది వరకు విద్యార్థులు బడికి హాజరయ్యారు. మండలంలో మొత్తం 39 పాఠశాలలున్నాయి. 9,571 మంది విద్యార్థులకుగాను దాదాపు 6 వేల మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ హాజరయ్యారని ఎంఈఓ ఈరన్న తెలిపారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీలో భాగంగా యూనిఫాంలు, బ్యాగులు, షూస్, పుస్తకాలు తదితర వస్తువులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, టీచర్ల చేతులమీదుగా పంపిణీ చేశారు.



చిన్నహ్యాటలో తరగతి గదిలో చిన్నారులు



తుగ్గలిలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



హాలహర్విలో పాఠశాల ఆవరణలో కూర్చొన్న విద్యార్థులు

ఉప్పొంగిన వేదావతి

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి గ్రామం వద్ద వేదావతి (హగరి) నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ భాగంలోని గుంతకల్, రాయదుర్గం, అనంతపురం తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం నదిలోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. గత కొద్దికాలంగా నదిలో నీటి జాడ లేక పరిసర గ్రామాలకు ఇబ్బందిగా మారిన తరుణంలో ఇటీవల కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదికి భారీగా వరద నీరు చేరుతోంది. దీనివల్ల పశువులు, ఇతర అవసరాలకు అనువుగా మారిందని నది పరివాహక గ్రామాలు హొన్నూరు, నాగరకణ్వీ, మార్లమడికి, కోగిలతోట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నది ఎగువ భాగంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద ఉధృతి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బ్రిడ్జి దిగువన నీటి ప్రవాహం కొనసాగుతోంది. వరద పోటెత్తితే ఈ మార్గంలో ఇరురాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.



మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నది




మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లెలో ఈ నెల 9న ఇరువర్గాల దాడిలో మృతి చెందిన గిరినాథ్‌చౌదరి కుటుంబ సభ్యులను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణమని, గ్రామాల్లో ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. అల్లర్లు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిలిచిన నీటి పంపింగ్

హొళగుంద: స్థానిక ఫిల్టర్‌బెడ్‌కు నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి హొళగుందలో ఉండే ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపి అక్కడి నుంచి గ్రామంలోని కుళాయిలకు సరఫరా చేస్తారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ట్యాంకు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపాలు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపింగ్ కావడం లేదు. దీంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



హొళగుందలోని ఫిల్టర్‌బెడ్‌కు నిలిచిన నీటి పంపింగ్

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ

హొళగుంద: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసేందుకు గురువారం చిన్నహ్యాట ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ జరిగింది. విత్తనాల కోసం కృషి యాప్‌లో రిజిష్టర్ చేసుకున్న రైతులకు వీఏఏ తస్లిమా విత్తనాలను పంపిణీ చేశారు. 40 శాతం సబ్సిడీతో 30 కేజీల బస్తా వేరుశనగ విత్తనకాయలను రూ.1,710 ప్రకారంగా ఎకరాకు ఒక బస్తా చొప్పున అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటివరకు 59 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతులు విత్తనాల కోసం ఆర్బీకేలో నమోదు చేసుకోవాలని సూచించారు.



చిన్నహ్యాట ఆర్బీకేలో ఉంచిన వేరుశనగ విత్తనాలు

పటిష్టమైనది భారతి సిమెంటు

కౌతాళం: అత్యుత్తమ భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంటు అని ఆ కంపెనీ జిల్లా సెల్స్ ఆఫీసర్ ఇక్బాల్‌బాషా, ఉదయ్‌లక్షణ్ అన్నారు. బాపురం రోడ్డులోని స్థానిక శ్రీలక్ష్మి ఏజెన్సీస్‌లో గురువారం తాపీ మేస్త్రీలకు సిమెంటు నాణ్యత వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 60 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోబోటిక్ జర్మనీ టెక్నాలజీతో భారతి సిమెంటు తయారువుతుందన్నారు. అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. ఎక్కువ దృఢత్వాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఏజెన్సీ డీలరు బసవరాజ్ స్వామి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి

ఆలూరు: జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలు, మంత్రులు దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్.రాధాకృష్ణ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం సీనియర్ నాయకులు నారాయణ స్వామి సమక్షంలో నియోజకవర్గ సీపీఎం కార్యకర్తలు, కార్మిక సంఘాలకు చెందిన నాయకులు తదితరులు సమావేశమయ్యారు. ముఖ్యఅతిథిగా జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు ప్రాజెక్టుల పనులు పెండింగ్‌లో ఉండడంతో రైతులు పంటలను సాగు చేసేందుకు వర్షాధారంపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందించాలని కోరారు. నాయకులు ఈరన్న, షాకీర్, నాగరాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి



అధ్వానంగా మారిన తెక్కలకోట రోడ్డు

హొళగుంద: స్థానిక అయ్యప్పస్వామి కాలనీతో పాటు పొలాలు, హొన్నూరు క్యాంపు వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్న తెక్కలకోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆ కాలనీవాసులు, రైతులు కోరుతున్నారు. ఈ మార్గంలో హొళగుంద నుంచి కర్ణాటకలోని తెక్కలకోట గ్రామం వరకు పూర్వీకులు తిరిగేవారు. ప్రస్తుతం వాల్మీకి సర్కిల్ నుంచి మొదలై హొన్నూరు కొట్టాల, హొన్నూరు తదితర గ్రామాల మీదుగా వెళ్తుంది. అయితే ప్రధానదారులు ఉండడంతో పాత రోడ్డు అధ్వానంగా మారింది. అలాగే పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

హొళగుంద: వ్యవసాయ పొలాలు, ఇతర రెవెన్యూకు సంబంధించిన పనుల కోసం మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని తహసీల్దారు ప్రసాద్‌రాజు అన్నారు. ఆయన గురువారం ఆర్‌ఐ దినోజ్ రాజశేఖరన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.. ప్రధానంగా రైతులు పొలాలకు సంబంధించి ఈ పాస్‌బుక్‌లు, ఆన్‌లైన్ అడంగల్, వన్‌బీ నమోదు, పొజిషన్ సర్టిఫికెట్లు తదితర పనుల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. రికార్డులు సరిగా లేకపోవడం, కోర్టులో ఉన్నటువంటి భూములు, సమస్యాత్మకంగా ఉన్న వాటి పనులు చేసేందుకు వీలు కాదన్నారు. కొందరు రైతులకు రెవెన్యూ రికార్డులు అత్యవసరం కావడంతో మధ్యవర్తులకు వేలకువేలు ఇచ్చి మోసపోతున్నట్లు తెలిసిందన్నారు. రెవెన్యూ వ్యవహారాల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం

- కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తున్నామని, తమకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం మొదటిసారిగా ఆమె గురువారం పత్తికొండకు వచ్చారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. ఎన్నికల ఫలితాలపై కంగాటి శ్రీదేవి వారితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా తన శాయశక్తులా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం కృషిచేశానని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలలో గెలుపు, ఓటములు సాధారణమన్నారు. ఎక్కడ లోపాలు జరిగాయో సమీక్షించుకుని ముందుకు వెళ్తామన్నారు. ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారన్నారు. ఓటమితో నిరాశ చెందవద్దన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి వారిని కాపాడుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఎన్నికలలో గెలిచిన వారు, నూతన ప్రభుత్వం అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. పత్తికొండ పట్టణంలో రోడ్లవిస్తరణ, టమాట జ్యూస్‌ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. శాంతిభద్రతలు కాపాడటంతో పాటు, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమపథకాలు అమలు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండాలని సూచించారు. సమావేశంలో పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, మండల కన్వీనర్లు కారం నాగరాజు, జిట్టానాగేష్, సర్పంచులు శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బలరాముడు, ఎంపీటీసీ సభ్యులు నెట్టేకల్లు, కృష్ణారెడ్డి, నాయకులు బాబు రెడ్డి, డీఎస్ యాదవ్, పెద్దహుల్తి నాగరాజు, టీఎండీ హుసేన్, కరువాల హుసేన్, భాస్కర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, చందోలి రవిరెడ్డి, పందికోన రవి, దూదేకొండ నరసింహులు, బాలకృష్ణ, పుచ్చకాయలమాడ మోహన్ పాల్గొన్నారు.


సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

చిప్పగిరి: సేంద్రియ ఎరువుల వినియోగంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ఏఓ విజయ లక్ష్మి సూచించారు. ఆమె గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. వ్యవసాయంలో అధిక దిగుబడి పొందాలంటే పొలాలు సారవంతంగా ఉండాలన్నారు. నేలను సారవంతం చేసేందుకు రసాయన ఎరువులను వినియోగిస్తే తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని, సేంద్రియ ఎరువుల వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. సేంద్రియ ఎరువల వల్ల ఎలాంటి భూమినైనా సారవంతం చేసి మంచి పంటలు పండివచ్చని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నేలలోని సూక్ష్మ కణాలు వృద్ధి చెంది పైర్లకు బలాన్నిస్తాయని చెప్పారు. దిగుబడులు నాణ్యతగా ఉండడంతో పాటు అధిక పోషక విలువలు కలిగి ఉంటాయని వివరించారు. అలాగే రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు.



నంచర్ల గ్రామంలో పొలంలో కుప్పలుగా పోసిన పశువుల ఎరువు

అండర్ బ్రిడ్జి కింద చేరిన వర్షపునీరు



బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

మద్దికెర : వారం రోజుల నుంచి మండలంలో వర్షం కురుస్తుండడంతో రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరి రైతులు, భక్తులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం స్థానిక ఇమాంవలి దర్గా సమీపంలోనున్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద దాదాపు 4 అడుగుల వరకు నీరు చేరింది. బ్రిడ్జి అవతలి వైపు గ్రామానికి చెందిన రైతులకు సుమారు 10వేల ఎకరాలకు పైగా పొలాలున్నాయి. అలాగే దర్గా ఉండటంతో నిత్యం భక్తులు వస్తుంటారు. బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో దాటి వెళ్లేందుకు సాహసం చేయలేకపోయారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు వేసేందుకు, దుక్కులు దున్నేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్టూడెంట్ కిట్ల తరలింపు

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందంచే పుస్తకాలు, షూస్, నోట్ పుస్తకాలు తదితర స్టూడెంట్ కిట్‌లను గురువారం ఎంఈఓ బాలనాయుడు మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కిట్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు త్వరలోనే కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేస్తారని వెల్లడించారు.



స్టూడెంట్ కిట్‌లను వాహనంలో తరలిస్తున్న దృశ్యం

వీధికుక్కల పట్టివేత

- 100 కుక్కలను బంధించిన బృందం

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ ఆజాద్, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ ఆదేశాల మేరకు సర్పంచ్ చలువాది రంగమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ గురువారం ప్రత్యేక బృందంతో వీధికుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కాలంలో హొళగుందలో కుక్కలు, కోతుల సంఖ్య విపరీతంగా పెరగడంతో పాటు పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తూ చేతుల్లో ఉన్న వాటిని లాక్కెళ్తున్నాయి. కొందరిపై దాడి చేసి గాయపరిచాయి. దీనిపై ఈ నెల 12న సాక్షి దినపత్రికలో 'వణికిస్తున్న వీధికుక్కలు' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. తిరుపతికి చెందిన కుక్కలు, కోతులు పట్టే బృందాన్ని రప్పించగా వారు రెండు గ్రూపులుగా ఏర్పడి ప్రధాన కూడళ్లలో దాదాపు వంద వీధికుక్కలను పట్టుకుని బోన్లలో బంధించారు. మూడు రోజుల పాటు గ్రామాల్లో తిరిగి వాటిని వీధి కుక్కలను బంధించి దూర ప్రాంతాలో కొండలు, నీరు, తిండి ఉన్న ప్రదేశాల్లో వదిలేయనున్నారు.



హొళగుందలో వీధి కుక్కలను బోన్లలో బంధించిన దృశ్యం



హెచ్‌ఎం నాగరాణిని సన్మానిస్తున్న ఆర్డీటీ సభ్యులు, గ్రామస్తులు

ఆర్డీటీ సేవలు ఎనలేనివి

దేవనకొండ: మండల పరిధిలోని తెర్నెకల్ గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో హెచ్‌ఎం నాగరాణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఆర్డీటీ సౌజన్యంతో ఎందరో పేదల జీవితాల్లో వెలుగును నింపుతున్నారన్నారు. చదవుకోవడానికి ఆర్థిక స్థోమత లేని కుటుంబాలను గుర్తించి వారి పిల్లలను ఆర్డీటీ వారు చదివిస్తున్నారని కొనియాడారు. అలాగే పిల్లలకు పుస్తకాలు, యూనిఫాంలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఆర్డీటీ సేవలు మరువలేనివని ప్రశంసించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయుల బృందం, తెర్నెకల్ ఆర్డీటీ లీడర్, పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.